నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 17 జూన్ 2024 | BHADRADRI KOTHAGUDEM

క్షతగాత్రుడిని స్వయంగా పైకి లేపుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్

మానవత్వానికి మరో రూపం..

క్షతగాత్రులను స్వయంగా లేపి తన వాహనంలో తీసుకెళ్లిన కలెక్టర్ జితేశ్

బాధ్యతలు చేపట్టిన మొదటిరోజే మన్ననలు అందుకున్న 'భద్రాద్రి బాస్'

బూర్గంపహాడ్, జూన్ 16: భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మానవత్వాన్ని చాటుకున్నారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కొద్ది గంటల్లోనే విశాల మానవత్వానికి రూపమిచ్చారు. ఆదివారం ఉదయం 10:15 గంటల సమయంలో కొత్తగూడెంలో భద్రాద్రి నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన.. భద్రాచలంలో ఐటీడీఏ పీవోగానూ అడిషనల్ చార్జ్ తీసుకున్నారు. అనంతరం తిరిగి కొత్తగూడెంలోని కలెక్టరేట్‌కు వెళ్తున్నారు. సాయంత్రం 4 గంటలకు బూర్గంపహాడ్ మండలం సారపాక నుంచి అదే మండలంలోని మణుగూరు క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకుంటుండగా.. అక్కడ ఆటో, బైకు ఢీకొన్నాయి. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి, ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులంతా అక్కడే పడి ఉన్నారు. అయితే ఈ ప్రమాద ఘటనను చూసిన కలెక్టర్.. వెంటనే తన అధికారిక వాహనాన్ని నిలుపుదల చేయించారు. హుటాహుటిన అక్కడికి చేరుకొని క్షతగాత్రులను పరిశీలించారు. వారిలో ఒక్కొక్కరినీ తానే స్వయంగా పైకి లేపి సిబ్బంది సహాయంతో తన అధికారిక వాహనంలో ఎక్కించారు. నేరుగా భద్రాచలంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. ఈ దృశ్యాలను చూసిన స్థానికులు నూతన కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

కలెక్టర్ల బాధ్యతల స్వీకరణ

- ఖమ్మంలో చార్జ్ తీసుకున్న ముజమ్మిల్ ఖాన్
- భద్రాద్రిలో బాధ్యతలు చేపట్టిన జితేశ్ పాటిల్
- భద్రాచలం ఐటీడీఏ పీవోగానూ అడిషనల్ చార్జ్

బాధ్యతలు స్వీకరిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

భద్రాద్రి నూతన కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

మామిళ్లగూడెం/ కొత్తగూడెం అర్బన్/ భద్రాచలం, జూన్ 16: ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు కొత్తగా నియమితులైన కలెక్టర్లు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. వివిధ జిల్లాల్లో పని చేస్తున్న కలెక్టర్లు, ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం శనివారం బదిలీ చేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా ఖమ్మం కలెక్టర్‌గా ఉన్న వీపీ గౌతమ్, భద్రాద్రి కలెక్టర్‌గా ఉన్న ప్రియాంక బదిలీ అయ్యారు. వీరి స్థానంలో ఖమ్మానికి ముజమ్మిల్ ఖాన్, భద్రాద్రికి జితేశ్ వీ పాటిల్ నియమితులయ్యారు. దీంతో ఆదివారం వీరు తమ తమ స్థానాల్లో బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి కలెక్టర్‌గా ఉన్న ముజమ్మిల్ ఖాన్ అక్కడ రిలీవ్ అయి.. ఆదివారం ఉదయం ఖమ్మం ఐడీవోసీకి చేరుకొని ఇక్కడి కలెక్టర్ వీపీ గౌతమ్ నుంచి చార్జ్ తీసుకున్నారు. తొలుత అనంతరం వీపీ గౌతమ్.. ముజమ్మిల్ ఖాన్‌ను పుష్పగుచ్ఛం అందించారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ముజమ్మిల్ ఖాన్‌ను ఖమ్మం జిల్లా అధికారులు మధుసూదన్‌నాయక్, శ్రీనివాస్, సోమశేఖరశర్మ, ఎంఏ గౌస్, గణేష్, ఎల్.రాజేందర్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు చెప్పి స్వాగతం పలికారు. అనంతరం నూతన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్.. ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా నూతన కలెక్టర్‌ను మంత్రి శాలువాతో సత్కరించారు.

భద్రాద్రిలో జితేశ్ పాటిల్..

భద్రాద్రి నూతన కలెక్టర్‌గా జితేశ్ వీ పాటిల్ ఆదివారం ఉదయం 10:15 గంటలకు ఐడీవోసీలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయనకు అదనపు కలెక్టర్ విదాయచందన, అన్ని శాఖల జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అధికారులందరినీ పరిచయం చేసుకున్నారు.

ఇన్‌చార్జి పీవో గానూ చార్జ్

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ భద్రాచలం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగానూ చార్జ్ తీసుకున్నారు. ఆదివారం భద్రాచలం చేరుకున్న ఆయన.. తొలుత భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నారు. అనంతరం పీవో చాంబర్‌లో ఇన్‌చార్జి పీవోగా బాధ్యతలు స్వీకరించారు.

సమర్థంగా పనిచేద్దాం: భద్రాద్రి కలెక్టర్

ఇన్‌చార్జి పీవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. అధికారులందరూ సమర్థవంతంగా పనిచేద్దామని అన్నారు. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన తాను సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశానని, అర్బన్ ప్లానింగ్‌లో మాస్టర్ డిగ్రీ పొందానని, పూణేలో ప్రైవేట్ కంపెనీలో కొంతకాలం పనిచేశానని తెలిపారు. తొలుత సంగారెడ్డి ట్రైనీ కలెక్టర్‌గా, తరువాత నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్, ఆ తరువాత కామారెడ్డి కలెక్టర్‌గా పనిచేశానని వివరించారు. తన తండ్రి విశ్వనాథ పాటిల్ ఆర్మీలో పనిచేసి రిటైర్ అయ్యారని, తన తల్లి రత్నమాల, తన భార్య శారద ఇద్దరూ గృహిణులని, తనకు ఒక కుమారుడు రాఘవ ఉన్నారని వివరించారు. ఇక్కడి అధికారులు, ఉద్యోగుల సహకారంతో ఈ గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందిస్తామనిఅన్నారు. విద్యా వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అంతకుముందు నూతన కలెక్టర్‌కు భద్రాచలం ఆర్డీవో దామోదరరావు, ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, యూనిట్ అధికారులు పుష్పగుచ్ఛాలు అందించారు. అదనపు కలెక్టర్ విద్యాచందన, ఐటీడీఏ అధికారులు మణెమ్మ, తానాజీ, సురేష్‌బాబు, నరసింహారావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుక్కి దున్నుతున్న రైతు

ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

ఊరిస్తూ.. ఉసూరుమనిపిస్తూ...

పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళలు

- ఉరుములు.. మెరుపులు.. మోస్తరు వానలే
- భారీ వర్షం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు
- విత్తనాలు నాటిన రైతన్నల చూపు.. ఆకాశం వైపు
- నేటి వరకు 'ఖమ్మంలో' 51 వేల ఎకరాల్లో పంటలు

వానకాలం సాధారణ సాగు విస్తీర్ణం : 5,96,662 ఎకరాలు
నేటివరకు పూర్తయిన సాగు : 51,023 ఎకరాలు
జూన్‌లో సాధారణ వర్షపాతం : 105 మిల్లీమీటర్లు
ఈ సంవత్సరంలో నేటివరకు(జూన్‌లో) : 66 మిల్లీమీటర్లు

ఖమ్మం వ్యవసాయం, జూన్ 16 : మృగశిర కార్తె ప్రారంభమై సగంరోజులు దాటినా, నైరుతి రుతుపవనాలు ప్రవేశించి పక్షంరోజులు కావస్తున్నా.. ఆశించిన మేర వర్షపాతం నమోదుకాలేదు. గత వారంరోజుల నుంచి వరుణుడు నిత్యం ఊరిస్తూ ఉసురుమనిపిస్తున్నాడు. ఎన్నో ఆశలతో సాగు చేపట్టాలనుకుంటున్న అన్నదాతలు ఆకాశం వైపు చూస్తున్నారు. తెల్లారింది మొదలు ఈ రోజైన భారీ వర్షం కురవకపోతదా.. విత్తనాలు నాటుకోలేకపోతామా అని కొందరు రైతులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. మరికొందరు రైతులు ఇప్పటికే పత్తి విత్తనాలు విత్తారు. జూన్ సగంరోజులు గడిచిపోయినప్పటికీ నైరుతి రుతుపవనాలు కేంద్రీకృతమైనప్పటికీ వర్షాలు కురవకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. వానకాలం ప్రారంభమై, విత్తనాలు సైతం కొనుగోలు చేసిన అన్నదాతలు దిగాలు పడుతున్నారు. గత సంవత్సరం సీజన్ ఆరంభంలో వరుణుడు కరుణించడం, సకాలంలో వర్షాలు కురవడంతో సాగు పనులు సకాలంలో పూర్తి చేసుకున్నారు. ఈ ఏడాది సైతం అదే పరిస్థితి పునరావృతం అవుతుందనే ఉద్దేశంతో వ్యవసాయశాఖ అధికారులు సైతం ముందస్తుగానే రాయితీ విత్తనాల పంపిణీ చేపట్టారు. జిల్లాలో అత్యధికంగా సాగు అయ్యే పత్తి పంటకు సంబంధించి సైతం విత్తన కొరత రాకుండా ఉండేందుకు ఆయా కంపెనీల డీలర్లు గోడౌన్‌ల్లో విత్తనాలను నిల్వ చేశారు. ఇంతవరకు బాగానే ఉన్న ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో వానకాలం సాగుపై అన్నదాతల ఆశలు సన్నగిల్లుతున్నాయి. అయితే నైరుతి రుతుపవనాల ప్రభావంతో మరో రెండు, మూడ్రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

50 వేల ఎకరాలకు చేరిన సాగు..

నేటివరకు ఖమ్మం జిల్లావ్యాప్తంగా వానకాలం సాగుకు సంబంధించి రైతులు 51,023 ఎకరాల్లో వివిధరకాల పంటలు సాగు చేశారు. పత్తి 35వేల ఎకరాలు, వరినారు మడులు 7 వేల ఎకరాలు, పెసర 3 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఇతర పంటలు మరో 450 ఎకరాల్లో సాగు చేశారు. జూన్‌లో సాధారణ వర్షపాతం 105 మిల్లీమీటర్లు కాగా నేటివరకు జిల్లావ్యాప్తంగా సరాసరి 66 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సింగరేణి, తిరుమలాయపాలెం, ఖమ్మంఅర్బన్, సత్తుపల్లి, మధిర మండలాల్లోనే సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగిలిన అన్ని మండలాల్లో సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదైంది. దీంతో ఆరుతడి, ఇతర పంటల సాగు విస్తీర్ణంపై అయోమయం నెలకొంది. అయితే ఈ నెల చివరివరకు నైరుతి రుతుపవనాల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు ప్రకటించడంతో భారీ వర్షపాతం నమోదు కోసం రైతులు వేచి చూస్తున్నారు.

పనుల్లో నిమగ్నమైన రైతులు..

కొద్దిరోజుల క్రితం ఓ మోస్తరు వర్షం కురవడంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే ఇప్పటికే విత్తనాలు నాటుకున్న రైతులు వర్షాల కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. మరికొందరు రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. నగరంలో ప్రైవేట్ విత్తన, ఎరువుల షాపులతోపాటు సహకార సంఘాల కార్యాలయాలు అన్నదాతల రాకతో కళకళలాడాయి. ఈ సంవత్సరం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏ ఒక్క రైతుకు విత్తన కొరత రాకుండా ఉండేవిధంగా టీ సీడ్స్ కార్పొరేషన్ అధికారులు సొసైటీలకు విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. అందుకు అనుగుణంగానే ఈ సంవత్సరం 74 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో విత్తనాలను విక్రయించనున్నారు. అయితే మరో రెండురోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సంబంధిత అధికారులు ప్రకటించడంతో రైతులు పూర్తిస్థాయిలో విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధమవుతున్నారు.

నేడు ఉద్యోగోన్నతుల వెబ్ ఆప్షన్స్ అలాట్‌మెంట్

- 34 అభ్యంతరాలపై సవరణలు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 16 : లాంగ్వేజ్ పండిట్‌లైన తెలుగు, హిందీ, పీఈటీ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ కోసం దశాబ్దాలుగా పోరాటం సాగించారు. ఆంధ్రా పాలకులు అప్‌గ్రేడేషన్‌ను పట్టించుకున్న పాపానపోలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి సీఎం కేసీఆర్ అప్‌గ్రేడ్ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు వెంటనే జీఓలను జారీ చేసింది. ఎన్నో ఏళ్ళ నుంచి ఎదురుచూస్తున్న కలను సాకారం చేసిన సీఎంగా కేసీఆర్ వారి గుండెల్లో ఎప్పటికి నిలిచిపోతారు. కోర్టు నుంచి కూడా మార్గం సుగమంకావడంతో ప్రక్రియ వేగవంతమై ఎట్టకేలకు గ్రేడ్-2 పండితులుగా, పీడీలుగా ఉద్యోగోన్నతులు పొందే ప్రక్రియలో వెబ్ ఆప్షన్స్ సైతం ఆదివారంతో ముగిశాయి. జిల్లావ్యాప్తంగా లాంగ్వేజ్ పండిట్ తెలుగు, హిందీ, పీఈటీలు ఖాళీల జాబితా ఆధారంగా వెబ్ ఆప్షన్స్ ఎంపిక చేశారు. సోమవారం మధ్యాహ్నానికి ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు పొందిన పాఠశాలలు అలాట్ కానున్నాయి. వారి జీవితంలో నూతన వెలుగులు రానున్నాయి.

34 అభ్యంతరాలు..

వెబ్‌ఆప్షన్స్ ప్రక్రియలో కొందరు ఉపాధ్యాయులు ఆప్షన్స్ ఎంపిక చేసుకునే పాఠశాలల వివరాలు గందరగోళంగా ఉండడంతో విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. కొన్ని పాఠశాలలకు సంబంధించిన యూడైస్ కోడ్ వల్లనే ఆయా పాఠశాలలకు సంబంధించిన సమాచారం తప్పుగా నమోదైందని గుర్తించి వాటిని సరిచేశారు. వెబ్ ఆప్షన్స్ ప్రక్రియలో వెబ్‌సైట్‌లో చోటు చేసుకున్న అంశాలపై 34 మంది అభ్యంతరాలను తెలుపగా వాటిని సాధ్యసాధ్యాలను పరిశీలించి పరిష్కరించినట్లు డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు.

బీటీ రోడ్ల నిర్మాణాలకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

బోనకల్లు, జూన్ 16: మండలంలోని మోటమర్రి, పెద్ద బీరవల్లి, తూటికుంట్ల గ్రామాల్లో రూ.4.86 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్లకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం శంకుస్థాపనలు చేశారు. మండలంలోని మోటమర్రి గ్రామంలో పంచాయతీ రోడ్డు ఏర్పాటుపై వివాదం ఏర్పడింది. ఆ గ్రామస్తుల విజ్ఞప్తితో ఆ వివాదాస్పద రోడ్డును డిప్యూటీ సీఎం పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పంచాయతీ రికార్డుల్లో ఉన్నట్లుగా రోడ్డును వెంటనే నిర్మించాలని అధికారులను ఆయన ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు రాజమౌళి, వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ సభ్యుడు మోదుగుల సుదీర్‌బాబు, తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో రాజు, మండల వ్యవసాయాధికారి సరిత తదితరులు పాల్గొన్నారు.

దినదిన గండం

- ఇల్లెందు పరిసర ప్రాంతాల్లోని రక్తశుద్ధి రోగుల ప్రాణసంకట అవస్థలు
- డయాలసిస్ కేంద్రంలో పేలిపోయిన ఎస్అండ్‌పీసీ బోర్డు కాయిల్స్
- యంత్రాలకు విద్యుత్ అందక పది రోజులుగా నిలిచిన డయాలసిస్ ప్రక్రియ
- ప్రతి రోజూ పొరుగు పట్టణాలకు వెళ్తున్న 20-30 మంది బాధితులు
- యంత్రాల పునరుద్ధరణకు మరో మూడు రోజులు పడుతుందన్న వైద్యులు
- ఆసుపత్రిలో తరచూ షార్ట్ సర్క్యూట్..
- నివారించాలంటున్న రోగులు..

ఇల్లెందు ప్రభుత్వాసుపత్రి

డయాలసిస్ సెంటర్లో ఏర్పాటు చేసిన బెడ్లు

ఇల్లెందు రూరల్, జూన్ 16:ఇల్లెందు ప్రభుత్వాసుపత్రిలోని డయాలసిస్ రోగుల ఆరోగ్య పరిస్థితి 'దిన దిన గండం' అన్నట్లుగా ఉంటోంది. పది రోజుల కిత్రం నాటి ఉరుములు, మెరుపుల వల్ల షార్ట్‌సర్క్యూట్ జరిగి డయాలసిస్ కేంద్రంలోని యంత్రం దెబ్బతిన్నది. అందులోని ఎస్అండ్‌పీసీ బోర్డు కాయిల్స్ కాలిపోయాయి. ఫలితంగా వారం, పది రోజులుగా ఈ ఆసుపత్రిలో డయాలసిస్ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ప్రతి రోజూ వచ్చే 20 నుంచి 30 మంది డయాలసిస్ రోగులకు ప్రాణసంకట పరిస్థితి ఏర్పడింది. దీంతో దిక్కుతోచని స్థితిలో పొరుగున ఉన్న పట్టణాలకు వెళ్తున్నారు. అదీగాక మూడు నాలుగు రోగులకు ఒకసారి రక్తశుద్ధి చేసుకోవాల్సిన రోగులైతే మరో ఇద్దరు సహాయకులను తీసుకొని వెళ్లాల్సి వస్తోంది.

రోజుకు 20 నుంచి 30 మంది రోగులు..

ఇల్లెందు ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ చేయించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి రోజుకు 20 నుంచి 30 మంది వరకూ రోగులు వస్తుంటారు. ఇక్కడ డయాలసిస్ ప్రక్రియ నిలిచిపోవడంతో వారంతా వ్యయప్రయాలకు, అనారోగ్య పరిస్థితులకు ఓర్చి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆసుపత్రి అంతా అధిక భాగం ఇనుముతో నిర్మాణం జరగడంతో వర్షాకాలంలో దీనిలో తరచూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సమస్య ఏర్పడుతోంది. అంతకుమునుపు కూడా షార్ట్‌సర్క్యూట్ జరగడంతో మంటలు వ్యాపించి ఆసుపత్రి సగానికి పైగా కాలిపోయిన విషయం విదితమే. వారం, పది రోజుల క్రితం వర్షం వచ్చిన సమయంలో మెరుపులు, పిడుగుల వల్ల డయాలసిస్ యంత్రం దెబ్బతిన్నది. మెషీన్‌లోని ఎస్అండ్‌పీసీ బోర్డులోని మొత్తం ఐదు కాయిల్స్ కాలిపోవంతో డయాలసిస్ ప్రక్రియ నిలిచిపోయింది. ఒక్కో కాయిల్‌కు రూ.35 వేల వరకూ ఉంటుందని, మొత్తం ఐదు కాయిల్స్‌కు రూ.2 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు చెబుతున్నారు. అయితే, ఢిల్లీకి చెందిన డీసీడీసీ కాంట్రాక్టు కంపెనీ బాధ్యులు 12 రాష్ట్రాల్లో డయాలసిస్ యంత్రాల మరమ్మతులు చేపడుతుంటారు. ఇల్లెందు ఆసుపత్రి యంత్రం నిర్వహణను కూడా వారే పర్యవేక్షిస్తుంటారు. అయితే వారు రావాలంటే మరో మూడు, నాలుగు రోజులు పడుతుందని ఆసుపత్రి వైద్యులు చెబుతున్నారు. కానీ ఇప్పటికే పది రోజులుగా ప్రక్రియ నిలిచిపోవడంతో ఇక్కడికి వచ్చే డయాలసిస్ రోగులను అశ్వారావుపేట, కొత్తగూడెం, ఖమ్మం, మణుగూరు, మహబూబాబాద్ తదితర ప్రభుత్వ ఆసుపత్రులకు పంపిస్తున్నారు.

ఎన్నో ప్రయాసలు..

ఒక డయాలసిస్ రోగిని తీసుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లి ప్రక్రియను పూర్తి చేయించుకుని రావాలంటే ఎన్నో వ్యయప్రయాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. సమయం కూడా అధికంగా వెచ్చించాల్సి వస్తోంది. దీంతో తమకు ఈ అవస్థలు తప్పాలంటే అధికారులు వెంటనే ఇక్కడ ప్రక్రియను పునరుద్ధరించాలని డయాలసిస్ రోగులు వేడుకుంటున్నారు.

వారంలో రెండుసార్లు డయాలసిస్ తప్పనిసరి..

ఇల్లెందు ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తే ఎంతో సంబుర పడ్డా. వారంలో రెండుసార్లు డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి నాది. ఇక్కడ డయాలసిస్ కేంద్రం ఉండడంతో ఇప్పటి వరకూ అంతా సాఫీగా సాగింది. కానీ వారం రోజుల క్రితం యంత్రంలో ఎస్అండ్‌పీసీ బోర్డు కాయిల్స్ కాలిపోయాయని, దీంతో డయాలసిస్ ప్రక్రియ నిలిచిపోయిందని ఆసుపత్రి వైద్యులు చెబుతున్నారు. దీంతో నా పరిస్థితి ఆందోళనగా ఉంటోంది.

-తిరుచి శివకుమార్, డయాలసిస్ రోగి, టేకులపల్లి

అవస్థలు పడుతున్నాం..

మూడు రోజులకు ఒక సారి చొప్పున డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి నాది. కొద్ది నెలలుగా నేను ప్రతిసారీ ఇల్లెందుకు వచ్చి డయాలసిస్ చేయించుకొని వెళ్తున్నాను. కానీ వారం పది రోజులుగా ఇక్కడ డయాలసిస్ చేయడం లేదు. యంత్రాలు దెబ్బతిన్నాయని చెప్పి అధికారులు ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు. కచ్చితంగా నిర్ణీత సమయంలోగా నేను డయాలసిస్ చేయించుకోకపోతే నా శరీర వ్యవస్థ దెబ్బతింటుంది. ఈ క్రమంలో మరో ఇద్దరి సహాయంతో వేరే ప్రాంతానికి వెళ్లి డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తోంది.

-జాన్ మణిబాబు, డయాలసిస్ రోగి, పాల్వంచ

త్వరలోనే అందుబాటులోకి వస్తుంది..

ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే డయాలసిస్ రోగులు అధైర్యపడొద్దు. మంగళవారం నాటికి డయాలసిస్ కేంద్రంలోని యంత్రాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇక్కడి సమస్యను ఇప్పటికే జిల్లా వైద్యాధికారులకు తెలియజేశాం. వారు డీసీడీసీ కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులకు సంప్రదించారు. 12 రాష్ట్రాల్లో ఈ కంపెనీ ప్రతినిధులే డయాలసిస్ మిషన్లకు మరమ్మతులు చేస్తుంటారు. వారు త్వరలోనే వచ్చి డయాలసిస్ రోగులకు ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తారు.

-డాక్టర్ హర్షవర్ధన్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, ఇల్లెందు

త్యాగానికి ప్రతీక 'బక్రీద్'

- నేడు 'ఈద్ ఉల్ అజ్‌హా'
- సిద్ధమైన మసీదులు, ఈద్గాహ్‌లు

ఖమ్మం, జూన్ 16: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. సోమవారం ఉదయం 6:45 గంటల నుంచి 8:30 వరకు మసీదులు, ఈద్గాహ్‌ల వద్ద 'ఈదుల్ అజ్‌హా' ప్రత్యేక నమాజును వేలాదిమంది ముస్లింలు ఆచరించనున్నారు. ఇందుకోసం మసీదులన్నీ ముస్తాబై ఉన్నాయి. త్యాగానికి ప్రతిరూపమైన బక్రీద్ పండుగలో 'ఖుర్బానీ' చేసేందుకు జిల్లా ముస్లింలు సిద్ధమయ్యారు. నమాజు అనంతరం తమ తహతకు తగ్గట్లు గొర్రెలు వంటి వాటిని ఖుర్బానీ చేసి ఆ మాంసాన్ని పంచిపెట్టేందుకు పూర్తి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే పండుగల్లో ముఖ్యమైనది బక్రీద్. ఇబ్రహీం అలైహిస్సలాం, ఆయన కుమారుడు ఇస్మాయిల్ అలైహిస్సలాం త్యాగస్మరణే సోమవారం ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఇదుల్ అజ్‌హా (బక్రీద్)ను జరుపుకుంటుంటారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం 'జిల్‌హజ్' మాసం 10న ఈ పండుగను జరుపుకుంటారు. అదేరోజు పవిత్ర మక్కా నగరంలో 'హజ్' కూడా జరుగుతుంది.

బక్రీద్ విశిష్టత..

బక్రీద్ పండుగను ఈదుల్ అజ్‌హాగా పేర్కొంటారు. ఖుర్బానీ అంటే సమర్పణ, త్యాగం, బలి అని అర్థం. సుమారు 4వేల ఏళ్ల క్రితం ఇరాక్ దేశంలో పండిత కుటుంబంలో జన్మించిన దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం కు(సల్లల్లాహు అలైహి వసల్లం) ఒకరోజున కల వచ్చింది. ఆ స్వప్నంలో 86 ఏళ్ల వృద్ధాప్యంలో జన్మించిన తన ఏకైక కుమారుడు ఇస్మాయిల్‌ను ఖుర్బానీ చేయాలని అల్లాహ్ ఆ కలలో ఇబ్రాహీంను ఆదేశించినట్లు కల సారాంశం. అల్లాహ్ ఆదేశానుసారం తన కుమారుడిని బలి ఇవ్వడం కోసం సిద్ధం కాగా అల్లాహ్ దాన్ని స్వీకరించి ఇస్మాయిల్‌కు బదులు స్వర్గం నుంచి ఓ పొట్టేలు (దుంబా)ను పంపి ఖుర్బానీ చేయడమే ఈ పండుగ ప్రత్యేకత.

మానవులంతా ఒక్కటేనని నమ్మాలి

బక్రీద్ పండుగ అనేది త్యాగానికి ప్రతీక. ఖుర్బానీ అంటే జంతుబలి కాదు, మానవుడు దైవమార్గంలో తన సర్వస్వాన్ని త్యజిస్తానని చేసే ప్రకటన మాత్రమే. దైవాన్ని విశ్వసించడం, మానవులంతా ఒకటేనని నమ్మాలి. చెడును నిరోధించడం, మంచిని పెంచడం, కష్టాలలో సహనం వహిస్తూ, త్యాగ నిరతిని చూపించాలన్న సందేశమే ఖుర్బానీలో దాగి ఉంది.

- ఎస్‌కే ఖాసిం, ఎంపీజే జిల్లా అధ్యక్షుడు

ఖుర్బానీ ప్రాముఖ్యత..

ఇబ్రాహీం త్యాగానికి ప్రతిఫలంగా ప్రాప్తించిన ఈ పండుగను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈదుల్ అజ్‌హా ప్రత్యేక నమాజు అనంతరం ఖుర్బానీ చేస్తారు. ఆర్థికంగా ఉన్నవారు ఒంటరిగా గొర్రె, మేకపోతులను దానం చేస్తారు. మధ్యతరగతి వారు ఏడుగురు కలిసి ఆవును, 13 మంది కలిసి ఒంటెను ఖుర్బానీ చేసి మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒకటి పేదలకు, మరొకటి బంధువులకు ఇస్తారు. ఇంకో వాటాను తమ ఇంటికి ఉపయోగించుకుంటారు.